కింగ్స్ దూకుడు

పంజాబ్‌కు వరుసగా రెండో విజయం • సొంతగడ్డపై లక్నోకు పరాభవం • ప్రభ్‌సిమ్రన్, శ్రేయస్ అర్ధ సెంచరీలు

ప్రభ్‌సిమ్రన్ (69)

లక్నో: తమ సుదీర్ఘ టైటిల్ నిరీక్షణకు తెరదించాలనే పట్టుదలతో ఐపీఎల్-18 బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్ రెండో మ్యాచ్‌లోనూ దూకుడు కొనసాగించింది. తొలి మ్యాచ్‌లో గుజరాత్‌ను ఓడించిన 'కింగ్స్'.. మలిపోరులో లక్నో సూపర్ జెయింట్స్‌పైనా అలవోక విజయం సాధించింది. ఏకనా స్టేడియంలో మంగళవారం జరిగిన పోరులో పంజాబ్.. లక్నోపై 8 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (34 బంతుల్లో 69, 9 ఫోర్లు, 3 సిక్సర్లు), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (30 బంతుల్లో 52 నాటౌట్, 3 ఫోర్లు, 4 సిక్సర్లు), నెహల్ వధేర (25 బంతుల్లో 43 నాటౌట్, 3 ఫోర్లు, 4 సిక్సర్లు) వీరవిహారంతో ప్రత్యర్థి నిర్దేశించిన 172 పరుగుల లక్ష్యాన్ని ఆ జట్టు 16.2 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది. అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన లక్నోను నికోలస్ పూరన్ (30 బంతుల్లో 44, 5 ఫోర్లు, 2 సిక్సర్లు), అయుష్ బదోని (33 బంతుల్లో 41, 1 ఫోర్, 3 సిక్సర్లు) ఆదుకున్నారు. ప్రభ్‌సిమ్రన్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

సంక్షిప్త స్కోర్లు

లక్నో: 20 ఓవర్లలో 171/7 (పూరన్ 44, బదోని 41, అర్ష్‌దీప్ 3/43, ఫెర్గూసన్ 1/26)

పంజాబ్: 16.2 ఓవర్లలో 177/2 (ప్రభ్‌సిమ్రన్ 69, శ్రేయస్ 52 నాటౌట్, దిగ్వేశ్ 2/30)

లక్ష్యం సరిపోలే!

పంజాబ్ బ్యాటర్ల దూకుడు ముందు లక్నో నిర్దేశించిన 172 పరుగుల లక్ష్యం ఏమాత్రమూ సరిపోలేదు. ప్రభ్‌సిమ్రన్, శ్రేయస్, వధేర ధాటికి లక్నో బౌలర్లు భారీగా పరుగులిచ్చుకున్నారు. ప్రియన్ష్ ఆర్య (8) విఫలమైనా కెప్టెన్ అండగా ప్రభ్‌సిమ్రన్ రెచ్చిపోయాడు. శార్దూల్ తొలి ఓవర్లోనే 4, 6తో పరుగుల ఖాతా తెరిచిన అతడు.. బిష్ణోయ్ 6వ ఓవర్లో రెండు బౌండరీలు, సిక్స్‌తో చెలరేగడంతో పవర్ ప్లే ముగిసేసరికే పంజాబ్ 62/1గా నిలిచింది. 23 బంతుల్లోనే అతడి హాఫ్ సెంచరీ పూర్తయింది. మరో ఎండ్‌లో శ్రేయస్ కూడా వేగంగా ఆడటంతో లక్ష్యం కరిగిపోయింది. ప్రమాదకరంగా పరిణమిస్తున్న ఈ జోడీని. 11వ ఓవర్లో దిగ్వేశ్ ప్రభ్‌సిమ్రన్‌ను ఔట్ చేయడంతో 84 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి బ్రేక్ వేశాడు. ప్రభ్‌సిమ్రన్ నిష్క్రమించినా ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన వధేరా ఎడాపెడా సిక్సర్లు, ఫోర్లు బాదడంతో భారీ ఛేదనను 'కింగ్స్' మరో 24 బంతులు మిగిలుండగానే ఊదేసింది.

ఆదుకున్న పూరన్

సొంతగడ్డపై తొలి మ్యాచ్ ఆడిన లక్నోకు తొలి పవర్ ప్లేలోనే భారీ షాకులు తాకాయి. గత రెండు మ్యాచ్‌లలో మెరుపులు మెరిపించిన మిచెల్ మార్ష్ (0)ను అర్ష్‌దీప్ తొలి ఓవర్ నాలుగో బంతికే ఔట్ చేసి లక్నోకు భారీ షాకిచ్చాడు. అతడే వేసిన మూడో ఓవర్లో మూడు బౌండరీలతో జోరుమీద కనిపించిన మార్క్‌రమ్ (18 బంతుల్లో 27, 4 ఫోర్లు, 1 సిక్సర్) ఫెర్గూసన్ నాలుగో ఓవర్లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. పంత్ (2) మరోసారి నిరాశపరిచాడు. అతడు క్రీజులోకి రాగానే మ్యాక్స్‌వెల్‌కు బంతినిచ్చిన శ్రేయస్.. ఫలితాన్ని రాబట్టాడు. పవర్ ప్లేలో 39 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయిన లక్నో ఇన్నింగ్స్ ఆ తర్వాత నెమ్మదించింది. దీంతో చాహల్ వేసిన పదో ఓవర్లో పూరన్.. 4, 4, 6తో గేర్ మార్చాడు. కానీ చాహల్ 12వ ఓవర్లో భారీ షాట్ ఆడబోయిన పూరన్.. మ్యాక్స్‌వెల్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. మిల్లర్ (19) విఫలమైనా ఆఖర్లో బదోని అండగా అబ్దుల్ సమద్ (12 బంతుల్లో 27, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) వేగంగా ఆడాడు.

శ్రేయస్ (52*)

పాయింట్ల పట్టిక

జ	మ్యా	గె	ఓ	పా	ర.రే
బెంగళూరు	2	2	0	4	2.26
పంజాబ్	2	2	0	4	1.48
ఢిల్లీ	2	2	0	4	1.32
గుజరాత్	2	1	1	2	0.62
ముంబై	3	1	2	2	0.30
లక్నో	3	1	2	2	-0.15
చెన్నై	3	1	2	2	-0.77
హైదరాబాద్	3	1	2	2	-0.87
రాజస్థాన్	3	1	2	2	-1.11
కోల్‌కతా	2	1	1	2	-0.30

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

టీబీఏ అధ్యక్షుడిగా రావుల

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ బాస్కెట్ బాల్ అసోసియేషన్ (టీబీఏ) అధ్యక్షుడిగా రావుల శ్రీధర్ రెడ్డి ఎన్నికయ్యారు. రిటర్నింగ్ అధికారి జస్టిస్ నవీన్ రావు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన అసోసియేషన్ ఎన్నికలలో రావుల గెలుపొందారు. గతంలో టీబీఏకు చైర్మన్‌గా పనిచేసిన ఆయన అధ్యక్ష పదవిలో 2029 దాకా కొనసాగనున్నారు. ప్రత్యర్థుల నుంచి దీటైన పోటీ ఎదురైనా రావుల విజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా చంద్రమోహన్ గౌడ్, వేణుగోపాల్ రెడ్డి, హఫీజ్ ఖాన్, విజయసారథి ఎన్నికవగా జనరల్ సెక్రటరీగా పృథ్వీశ్వర రెడ్డి, ఉమ్మడి కార్యదర్శులుగా విష్ణుకుమార్, మహ్మద్ సమీయుద్దీన్, అసోసియేట్ సెక్రటరీలుగా సుకుమార్, నస్రుల్లా హైదర్, ట్రెజరర్‌గా చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు పరిశీలకులుగా శాట్ నుంచి డీడీ రవీందర్, తెలంగాణ ఒలింపిక్ సంఘం నుంచి ఖాజా హాజరయ్యారు.

టాప్-100లోకి స్నేహిత్

హైదరాబాద్: చెన్నైలో జరిగిన డబ్ల్యూటీటీ స్టార్ కంటెండర్‌లో రాణించిన యువ టేబుల్ టెన్నిస్ స్టార్, హైదరాబాద్‌కు చెందిన ఆర్. స్నేహిత్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్-100 లోకి దూసుకొచ్చాడు. ఈ టోర్నీ సింగిల్స్ విభాగంలో క్వార్టర్స్‌కు, డబుల్స్‌లో దిగ్గజ ఆటగాడు శరత్ కమల్‌తో కలిసి సెమీస్ చేరిన స్నేహిత్.. 34 స్థానాలు మెరుగుపరుచుకుని 89వ ర్యాంకుకు చేరాడు. ఇదే విషయమై స్నేహిత్ స్పందిస్తూ.. 'టాప్-100లోకి రావడం ఈ ఏడాది నా లక్ష్యాల్లో ఒకటి. దానిని సాధించా. రాబోయే రోజుల్లో టాప్-50లో చేరడమే నా లక్ష్యం' అని తెలిపాడు.

ముగిసిన పాసుల వివాదం

- **ఎస్ఆర్‌హెచ్, హెచ్‌సీఏ చర్చలు సఫలం**

హైదరాబాద్, ఆట ప్రతినిధి: కాంప్లిమెంటరీ పాసుల వ్యవహారంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్), హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మధ్య నెలకొన్న వివాదం సద్దు మణిగింది. హెచ్‌సీఏ కార్యదర్శి ఆర్. దేవ్‌రాజ్ సమక్షంలో ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ స్టేడియంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఎస్ఆర్‌హెచ్ ప్రతినిధులు కిరణ్, శరవణన్, రోహిత్ పాల్గొని చర్చలు జరిపారు. చర్చల సందర్భంగా.. బీసీసీఐ, ఎస్ఆర్‌హెచ్, హెచ్‌సీఏ ట్రైపార్టీ ఒప్పందాన్ని కచ్చితంగా పాటించాలని, ఆ మేరకు స్టేడియం సామర్థ్యంలోని అన్ని విభాగాల్లో 10 శాతం కాంప్లిమెంటరీ పాసులను కేటాయించాలని హెచ్‌సీఏ ప్రతిపాదించగా దానికి ఎస్ఆర్‌హెచ్ అంగీకారం తెలిపింది. ఉప్పల్‌లో జరుగబోయే ఐపీఎల్ మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించేందుకు పూర్తిగా సహకరిస్తామని హెచ్‌సీఏ హామీ ఇచ్చింది. చర్చల అనంతరం వివాదం ముగిసిందని ఇరు వర్గాలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి.

రిటైర్మెంట్ వార్తలకు చెక్ పెట్టిన కోహ్లీ

బెంగళూరు: గతేడాది వెస్టిండీస్‌లో ముగిసిన ఐసీసీ టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత ఈ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ.. వన్డేలలో తన భవిష్యత్‌పై స్పష్టతనిచ్చాడు. ఇటీవలే ముగిసిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ విజయం తర్వాత రోహిత్‌తో పాటు కోహ్లీ ఈ ఫార్మాట్ నుంచి తప్పుకుంటారని వార్తలు వచ్చినా రోహిత్ దానిని కొట్టిపారేయగా తాజాగా కోహ్లీ తన భవిష్యత్ ప్రణాళికల గురించి తెలిపాడు. బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న కోహ్లీని యాంకర్.. 'మీ నెక్స్ట్ బిగ్ స్టెప్ గురించి ఏమైనా హింట్ ఇస్తారా' అని అడిగింది. దానికి కోహ్లీ స్పందిస్తూ.. 'నిజంగా నాక్కూడా తెలీదు. బహుశా తర్వాతి వన్డే ప్రపంచకప్ గెలవడమేమో!' అని చెప్పాడు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.

వందన వీడ్కోలు

రిటైర్మెంట్ ప్రకటించిన స్టార్ హాకీ ప్లేయర్

ఢిల్లీ: భారత మహిళల హాకీ జట్టు క్రీడాకారిణి వందన కటారియా తన 15 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలికింది. దేశం తరపున 320 మ్యాచ్‌లలో 158 గోల్స్ చేసిన వందన.. భారత మహిళా హాకీ జట్టుకు అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా గుర్తింపు దక్కించుకుంది. 2009లో సీనియర్ జట్టులోకి వచ్చిన వందన.. 15 ఏండ్ల కెరీర్‌లో భారత్ సాధించిన చరిత్రాత్మక విజయాల్లో కీలక పాత్ర పోషించింది. టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచిన భారత జట్టులో ఆమె సభ్యురాలు. ఆ మెగా టోర్నీలో వందన హ్యాట్రిక్ గోల్స్ చేసి భారత్ తరపున ఒలింపిక్స్‌లో ఈ ఘనత సాధించిన తొలి మహిళా ప్లేయర్‌గా రికార్డులకెక్కింది. ఆటకు వందన చేసిన సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం ఆమెకు 2021లో అర్జున, 2022లో పద్మశ్రీ అవార్డులతో సత్కరించింది.

ధర ఘనం.. ఆట ఘోరం

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

ఐపీఎల్ వేలంలో ఎవరూ ఊహించని ధర దక్కించుకున్న ఆటగాడి నుంచి ఆ సీజన్‌లో 'పైసా వసూల్' ప్రదర్శనను ఆశించడం అత్యాశే! 2008లో మొదలైన ఈ లీగ్ చరిత్రలో ఇప్పటిదాకా నిర్వహించిన వేలం ప్రక్రియలలో 'మోస్ట్ ఎక్స్‌పెన్సివ్ ప్లేయర్'గా నిలిచిన ఆటగాళ్లు ఫీల్డ్‌లో 'వారెవ్వా..' అనిపించే ప్రదర్శనలు ఇచ్చిన దాఖలాల్లేవు. 2009లో నుంచి చరిత్ర చెబుతున్న సత్యమిదే. 2009లో ఇంగ్లండ్ దిగ్గజం ఫ్లింటాఫ్‌ను చెన్నై రూ. 9 కోట్లు వెచ్చించి తీసుకుంటే మూడు మ్యాచ్‌లలో అతడు చేసింది 62 పరుగులు, తీసింది 2 వికెట్లు. దీంతో చెన్నై అతడిని తర్వాత మ్యాచ్‌లు ఆడించే సాహసం చేయలేదు. అదే సీజన్‌లో కెవిన్ పీటర్సన్‌ను బెంగళూరు రూ. 9.8 కోట్లు పెట్టి కొనుగోలు చేస్తే 6 ఇన్నింగ్స్‌లలో అతడు చేసింది 62 రన్స్. 2015లో యువరాజ్, 2022లో ఇషాన్ కిషన్, 2023లో బెన్ స్టోక్స్.. ఇలా చెప్పుకుంటూ పోతే జాబితా పెద్దదే. తాజా సీజన్‌లో అదే పరిస్థితి కనిపిస్తున్నది. ఈ సీజన్ కోసం గత డిసెంబర్‌లో నిర్వహించిన వేలం ప్రక్రియలో రికార్డు స్థాయిలో రూ. 27 కోట్ల జాక్‌పాట్ కొట్టిన రిషభ్ పంత్‌దీ అదే కథ. ఈ సీజన్‌లో ఇప్పటిదాకా మూడు మ్యాచ్‌లు ఆడిన పంత్ చేసింది 17 పరుగులే. ఢిల్లీతో తొలి మ్యాచ్‌లో డకౌట్ అయిన పంత్.. తర్వాత హైదరాబాద్‌తో పోరులో 15 పరుగులకే ఔట్ అయ్యాడు. తాజాగా పంజాబ్‌తో మ్యాచ్‌లో 2 రన్స్‌కే వెనుదిరిగాడు. పంత్ ఒక్కడే కాదు.. ఈ ఏడాది అధిక ధర పొందిన మరో ఆటగాడు వెంకటేశ్ అయ్యర్ (కోల్‌కతా- రూ. 23.75 కోట్లు) కూడా వైఫల్యాల బాట పట్టాడు. బెంగళూరుతో మ్యాచ్‌లో 6 పరుగులే చేసిన అతడు.. ముంబైతో మ్యాచ్‌లో 3 రన్స్‌కే ఔట్ అవడంతో సోషల్ మీడియాలో అతడి ప్రదర్శన, ధరపై విస్తృతంగా ట్రోలింగ్ సాగుతున్నది. సాధారణంగా వేలంలో భారీ ధర దక్కించుకున్న ఆటగాడికి 'ప్రైస్ ట్యాగ్' ఒత్తిడి 'తోడు తెచ్చుకున్న చుట్టం' అయితే సారథ్య బాధ్యతలు అదనపు భారం! పంత్ ప్రస్తుతం రెండు సవాళ్లు ఎదుర్కొంటున్నాడు. ఫీల్డ్‌లో అనవసరపు షాట్లు ఆడి వికెట్ పారేసుకోవడంలో తనకు తానే సాటి అని గతంలో చాలాసార్లు నిరూపించుకున్న పంత్.. తాజా సీజన్‌లోనూ అదే ఆటతీరుతో నిరాశపరుస్తున్నాడు. పంజాబ్‌తో మ్యాచ్‌లో ఆడిన షాటే అందుకు ప్రత్యక్ష ఉదాహరణ. అసలే గత సీజన్‌లో జట్టు విఫలమైనందుకు నాటి సారథి కేఎల్ రాహుల్‌తో స్టేడియంలోనే వాగ్వాదానికి దిగి అతడిని పక్కనబెట్టిన లక్నో యజమాని సంజీవ్ గొయెంకా.. ఏరికోరి తెచ్చుకున్న పంత్ ఇలా విఫలమవుతుంటే చూస్తూ ఊరుకుంటాడా? అన్నది ఆసక్తికరం! రాబోయే మ్యాచ్‌లలో అయినా పంత్ తన ఆటతీరు మార్చుకోకుంటే రాహుల్ స్థానంలో పంత్ ఉండటం పెద్ద ఆశ్చర్యపోయే విషయం కాదని సోషల్ మీడియాలో ఇప్పటికే కామెంట్లు వినిపిస్తున్నాయి.

చిత్రం

ఆక్షన్ వద్దు.. ఆక్సిజన్ కావాలి!

హెచ్‌సీయూ భూముల వేలంపై సినీతారల ఆగ్రహం

సోషల్‌మీడియా వేదికగా నిరసన, ట్రెండింగ్‌లో 'సేవ్ హెచ్‌సీయూ' హ్యాష్ ట్యాగ్

దేశంలోనే ప్రతిష్టాత్మకమైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూముల వేలం విషయంలో రేవంత్ ప్రభుత్వం అనుసరిస్తున్న దౌర్జన్యపూరిత వైఖరిని పలువురు సినీప్రముఖులు సోషల్‌మీడియా వేదికగా ఆక్షేపించారు. వన్యప్రాణుల ఆక్రందనల నడుమ పచ్చటి అడవిని జేసీబీలతో నేలమట్టం చేయడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సేవ్ గ్రీన్‌లంగ్స్ ఆఫ్ హైదరాబాద్' అంటూ సోషల్‌మీడియా వేదికగా నినదించారు. వేలానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న యూనివర్సిటీ విద్యార్థులకు మద్దతు ప్రకటించారు. 'సేవ్ హెచ్‌సీయూ బయోడైవర్సిటీ' అనే హ్యాష్‌ట్యాగ్‌తో తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు.

- 'ఈ విధ్వంసం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఇది మంచిది కాదు. ఈ అరాచకానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న విద్యార్థులు, పౌరుల పక్షాన నేను నిలబడతాను. వారి నిరసనకు అందరూ మద్దతు ప్రకటించాలని, మన భవిష్యత్తు కోసం కదిలిరావాలని ప్రజలను కోరుతున్నా' అంటూ ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. దీనికి 'సేవ్ హెచ్‌సీయూ బయోడైవర్సిటీ' 'ఆక్సిజన్ నాట్ ఆక్షన్' 'సేవ్ హెచ్‌సీయూ' అనే హ్యాష్‌ట్యాగ్‌లను జత చేశారు. పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే ఈ పోస్ట్‌ను లక్షల మంది వీక్షించారు.
- సీనియర్ నటి రేణూ దేశాయ్ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో వరుస వీడియోలతో హెచ్‌సీయూ ఘటనలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. యూనివర్సిటీ భూములను కాపాడుకునేందుకు అందరూ ఉద్యమించాలని కోరింది. యూనివర్సిటీ క్యాంపస్‌లో ఒక్క దుప్పి కూడా లేదని చెప్పిన సీఎం రేవంత్ స్టేట్‌మెంట్‌ను ఉటంకిస్తూ దుప్పుల మంద ఉరుకుతున్న వీడియోను షేర్ చేసింది. 'ఒక్కసారి ఈ వీడియోను సీఎం రేవంత్‌రెడ్డికి పంపించండి' అని రేణూదేశాయ్ కోరింది. ప్రభుత్వం చేస్తున్న విధ్వంసకాండలో అడవిలోని మూగజీవులు ఎక్కడికి వెళ్లాలో తెలియక బిక్కుబిక్కుమంటున్నాయని రేణూదేశాయ్ ఆవేదన వ్యక్తం చేసింది. అడవి నేలమట్టంతో హెచ్‌సీయూ భూములనే కాదు నగరంలోని కోటి 20లక్షల మంది ప్రజల గ్రీన్‌లంగ్స్‌ను కూడా ధ్వంసం చేస్తున్నారంటూ ఓ వీడియోను పోస్ట్ చేసింది.
- హెచ్‌సీయూ భూముల వేలానికి వ్యతిరేకంగా అగ్రదర్శకుడు నాగ్‌అశ్విన్ గతంలోనే స్పందించారు. 400 ఎకరాల భూమిని అమ్ముకోవడం మనఖర్మ అంటూ వ్యాఖ్యానించారు. తాజాగా ప్రకాష్ రాజ్, రేణూదేశాయ్ ఈ ఘటనపై తమ నిరసన వ్యక్తం చేశారు. అడవి ధ్వంసం అవుతుంటే నెమళ్ల ఆక్రందనలు ప్రతిధ్వనిస్తున్నాయి. ఈ వేలాన్ని ఆపాలి అంటూ ప్రియదర్శి, కావ్యా కల్యాణ్‌రామ్, ఫరియా అబ్దుల్లా, రష్మి, అనసూయ వంటి తారలు హెచ్‌సీయూ భూముల వేలానికి వ్యతిరేకంగా స్పందించారు. 'ఆల్ ఐస్ ఆన్ హెచ్‌సీయూ' 'సేవ్ హెచ్‌సీయూ బయోడైవర్సిటీ' హ్యాష్‌ట్యాగ్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్‌లు పెట్టారు. వీరితో పాటు సినీరంగంలోని పలువురు యువ హీరోలు, దర్శకనిర్మాతలు కూడా హెచ్‌సీయూలో విద్యార్థులపై జరుగుతున్న దౌర్జన్యం, గ్రీన్ కారిడార్ విధ్వంసం పట్ల ఆగ్రహంగా ఉన్నారు.

ఇక ముప్పై రోజులే..

'హిట్' ఫ్రాంచైజీలో వచ్చిన రెండు చిత్రాలు ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్స్‌గా ప్రేక్షకుల్ని మెప్పించాయి. దీంతో మూడో భాగం 'హిట్: ది థర్డ్ కేస్' నిర్మాణం నుంచే హైప్ క్రియేట్ చేస్తున్నది. నాని కథానాయకుడిగా శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ఫస్ట్ సింగిల్‌కు మంచి స్పందన లభించింది. ఈ చిత్రాన్ని మే 1న విడుదల చేయబోతున్నారు. రిలీజ్‌కు ఇంకా ముప్పైరోజులు మాత్రమే మిగిలి ఉండటంతో ప్రచారపర్వాన్ని వేగవంతం చేశారు. మంగళవారం 30డేస్ కౌంట్‌డౌన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో నాని తుపాకీ గురిపెట్టి ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్నారు. నాని పోలీస్ అధికారి పాత్రలో నటిస్తున్న ఈ సినిమా క్రైమ్ థ్రిల్లర్‌గా ఆకట్టుకుంటుందని, నాని పాత్ర మునుపెన్నడూ చూడని రీతిలో సాగుతుందని మేకర్స్ తెలిపారు. శ్రీనిధిశెట్టి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, నిర్మాణ సంస్థలు: వాల్‌పోస్టర్ సినిమా, యునానిమస్ ప్రొడక్షన్స్, రచన-దర్శకత్వం: శైలేష్ కొలను.

అల్లు అర్జున్‌తో త్రివిక్రమ్ పూర్తి పౌరాణిక చిత్రం

తెలుగు సినిమా పౌరాణికంతో మొదలైంది. పౌరాణికంతోనే ఎదిగింది. కానీ.. పోనుపోనూ పౌరాణికాలు జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. టాలీవుడ్‌లో వచ్చిన చివరి పౌరాణికం 'శ్రీరామరాజ్యం'. ఆ తర్వాత మళ్లీ పౌరాణిక చిత్రం రాలేదు. అయితే.. త్వరలో ఓ పానిండియా పౌరాణిక చిత్రానికి రంగం సిద్ధం అవుతున్నది. ఈ విషయాన్ని స్వయంగా ఆ చిత్ర నిర్మాతే ప్రకటించారు. ఆ నిర్మాత ఎవరో కాదు.. సితార ఎంటర్టైన్మెంట్స్ అధినేత సూర్యదేవర నాగవంశీ. ఇక సినిమా వివరాల విషయానికొస్తే.. అల్లు అర్జున్ కథానాయకుడిగా త్రివిక్రమ్ శ్రీనివాస్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఆ సినిమా పౌరాణిక చిత్రమని, అందులో కుమారస్వామిగా బన్నీ నటించనున్నారని, శివపురాణం నేపథ్యంలో సినిమా ఉంటుందని గతంలో వార్తలొచ్చాయి. ఇప్పుడు నాగవంశీ అసలు విషయాన్ని చెప్పేయడంతో బన్నీ, త్రివిక్రమ్‌ల సినిమాపై ఆడియన్స్‌లో ఓ క్లారిటీ వచ్చేసింది. అయితే.. ఇందులో బన్నీ పోషించే పాత్ర వివరాలను మాత్రం నాగవంశీ రివీల్ చేయలేదు. అక్టోబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుకానున్నదని మాత్రం చెప్పారు. 14ఏండ్ల విరామం తర్వాత రాబోతున్న ఈ పౌరాణిక చిత్రంపై ఇప్పట్నుంచే ప్రేక్షకుల్లో అంచనాలు మొదలయ్యాయి.

అందరూ తెలుగువాళ్లే..!

'ఇది నా డ్రీమ్‌టీమ్. ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో నటించాలన్న నా కల ఈ సినిమాతో నెరవేరింది' అన్నారు ప్రియదర్శి. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'సారంగపాణి జాతకం'. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ నెల 18న ప్రేక్షకుల ముందుకురానుంది. సోమవారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. అందరూ తెలుగు ఆర్టిస్టులు నటించిన పూరిపూర్ణమైన తెలుగు సినిమా ఇదని దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి తెలిపారు. కేవలం జాతకాలను మాత్రమే నమ్మకుండా మనం చేయాల్సిన పని చేయాలనే గొప్ప పాయింట్‌ను ఆవిష్కరించే చిత్రమిదని నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ అన్నారు.

కంటెంట్‌ని నమ్మి చేసిన సినిమా

'28 డిగ్రీస్ సెల్సియస్ టెంపరేచర్‌లో ఉండాల్సిన కండీషన్ హీరోయిన్‌కి ఏర్పడుతుంది. ఆ టెంపరేచర్ దాటితే ఆమెకు ప్రాణాపాయం. అలాంటి పరిస్థితిని ఆ జంట ఎలా ఎదుర్కొన్నారు అనేది ఈ కథలో ఆసక్తికరమైన అంశం' అని నిర్మాత సాయిఅభిషేక్ అన్నారు. నవీన్‌చంద్ర, షాలినీ వడ్నికట్టి జంటగా ఆయన నిర్మించిన ఎమోషనల్ థ్రిల్లర్ లవ్‌స్టోరీ '28 డిగ్రీస్ సెల్సియస్'. 'మా ఊరి పొలిమేర'ఫేం డా.అనిల్ విశ్వనాథ్ దర్శకుడు. ఈ నెల 4న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత సాయి అభిషేక్ మంగళవారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ '2017లో సినిమా స్టార్ట్ చేశాం. 2019లో పూర్తయ్యింది. 2020 మేలో విడుదల చేయాలనుకున్నాం. కోవిడ్ వల్ల థియేటర్స్ క్లోజ్ అయ్యాయి. ఓటీటీ ఆఫర్లొచ్చాయి. థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ కోసం వెయిట్ చేశాం. ఇన్నాళ్లకు కుదిరింది. వైజాగ్‌లో షూటింగ్ స్టార్ట్ చేసి, గోవా, జార్జియాల్లోని పలు అందమైన లొకేషన్లలో చిత్రీకరణ జరిపాం. కంటెంట్‌పై ఉన్న నమ్మకంతో క్వాలిటీ విషయంలో రాజీపడలేదు' అని తెలిపారు.

సినిమా బతికితేనే అందరం బాగుంటాం

'రివ్యూ అనేది వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. దాన్ని వ్యక్తం చేయడంలో తప్పులేదు. నిజాయితీగా ఇచ్చే రివ్యూలను గౌరవిస్తాం. కానీ కొందరు సినిమాను చంపేయాలనే ఉద్దేశ్యంతో రివ్యూలు రాస్తున్నారు. అంతటితో ఆగకుండా అనవసరమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. అది తప్పు. సినిమా బతికితేనే.. అందరం బాగుంటాం అనే విషయాన్ని వారూ గ్రహించాలి.' అంటూ నిర్మాత సూర్యదేవర నాగవంశీ ఘాటుగా స్పందించారు. ఆయన నిర్మించిన 'మ్యాడ్ స్క్వేర్' చిత్రం ఇటీవలే విడుదలై విజయవంతంగా ప్రదర్శింపబడుతున్నది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో నాగవంశీ విలేకరులతో ముచ్చటించారు. 'నాలుగు రోజుల్లోనే పంపిణీదారులంతా లాభాలబాట పట్టారు. తొలివారం టికెట్ రేట్లు పెంచాం. మంగళవారం నుంచి మాత్రం అన్ని చోట్లా సాధారణ ధరలే ఉంటాయి. కుటుంబ ప్రేక్షకులకు సినిమాను మరింత చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని నాగవంశీ పేర్కొన్నారు. భారీ బడ్జెట్ సినిమా కాకపోయినా తమ సినిమాకు జనం బ్రహ్మరథం పడుతున్నారని, దానికి వినోదమే కారణమని, ఫస్ట్ హాఫ్ కంటే సెకండాఫ్‌నే ఆడియన్స్ ఎక్కువ ఎంజాయ్ చేస్తున్నారని నాగవంశీ అభిప్రాయపడ్డారు. నాలుగురోజుల్లో ప్రపంచవ్యాప్తంగా 70కోట్ల గ్రాస్ వసూలు చేసిందని ఆయన తెలిపారు.

ఆయన సినిమా అనగానే భయపడ్డా!

'చేస్తున్న క్యారెక్టర్‌ని బట్టి ఆయన బిహేవియర్ ఉంటుంది. జోవియల్ క్యారెక్ట